65

# సీసా

"హలో, ఎవరు మాట్లాడేది ?"

"శారద స్పీకింగ్. మీకెవరు కావాలి ?"

"ఓ శారదా నువ్వేనా !"

"అవును. మీరెవరు ?"

"నేను శారదా. గొంతు గుర్తుపట్టలేదా !"

"మూర్తి !"

"అవును. మూర్తినే."

"ఎక్కడినించి మాట్లాడుతున్నావు ?"

"ద్వారకానించి."

"హైద్రాబాద్ ఎప్పుడొచ్చావు ?"

"ఇప్పుడే. రూమ్‌లోకి ప్రవేశించీ ప్రవేశించగానే నీకు ఫోన్ చేయాలని బుద్ధి పుట్టింది."

"ట్రెయిన్‌లో వచ్చావా ?"

"అవును. రెండు గంటలు లేటు."

"హైద్రాబాద్‌లో ఏం పని ?"

"ఇక్కడ స్టేట్ బ్యాంక్‌లో ఇంటర్వ్యూ ఉంది. ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టు."

"ఎన్ని గంటలకి ?"

"పదకొండు. ఇప్పుడు పదయింది. శారదా, నిన్నొకసారి వెంటనే చూడాలని ఉంది."

'ఎందుకో ?'

"ఇన్‌స్పిరేషన్‌కోసం."

' అలాగే! ఇంటర్వ్యూ గ్రాంటెడ్. కమ్ ఎలాంగ్."

"కాదు. నువ్వే రావాలి."

"నేనా, హోటల్‌కా ?"

"పరవాలేదు పట్టపగలు పది గంటల వేళ."

"బాగుండదు."

"రూమ్‌లోకి వద్దులే. రిసెప్షన్ కౌంటర్ నుంచి ఫోన్ చెయ్యి. లౌంజులో మాట్లాడుకుందాం."

"అలా అయితేగాని పబ్లిసిటీ బాగా కాదు."

"ప్లీజ్"

"నేను రాకపోతే ఇంటర్‌వ్యూలో ఫెయిలవుతావా ?"

"సెంట్ పర్‌సెంట్. నువ్వు ఇన్‌స్పిరేషన్ ఇస్తే సెంట్ పర్‌సెంట్ సక్సెస్. ఉద్యోగం ఖాయం."

"సరే."

"థ్యాంక్యూ. రూమ్ నంబర్ రెండు వందల పన్నెండు."

"ఓ. కె."

మూర్తి ఉత్సాహంగా ఈలవేసి బాత్రూంలోకి దూరాడు. ఆ మధ్యవరకూ అతను హైదరాబాద్‌లోనే ఎం. ఏ. చదువుతూ హాస్టల్లో ఉండేవాడు. రేడియోలో క్విజ్ ప్రోగ్రాంలో శారదతో పరిచయం కలిగింది. ఆమె మంజుల వాగ్విలాసిని అని అతనికి తెలిసింది. అతను చదువులో గొప్ప తెలివి తేటలు కలవాడనీ, వ్యవహార ప్రపంచంలో వట్టి అప్రయోజకుడనీ ఆమెకి త్వరలోనే అభిప్రాయం కలిగింది. దానికి తోడు బొమ్మలు వేస్తాడని కూడా తెలిసి ఆ అభిప్రాయం ధృడపరచుకుంది. రంగుల ప్రపంచంలో తేలిపోయే కళారసజ్ఞులు ప్రపంచంలో రంగులు తెలుసుకోలేరని ఆమె నమ్మకం. అతని వదనంలో ఏదో అమాయకత్వం ఆమెకి గోచరిస్తుంది. రంగుల్లో ఆమె బొమ్మల్ని ఎన్నో అతను చిత్రించాడు. అవన్నీ చూస్తుంటే తను అతని మనస్సుని ఎంతగా ఆక్రమించిందో అవగతమై అతని మీద జాలీ, అభిమానమూ ఆమెకి పెంపొందాయి. "యోగక్షేమం వహామ్యహం" అనుకుంది. పెద్దలు నిశ్చయించలేదుగాని వాళ్ళిద్దరూ తమ వివాహం నిశ్చయించుకోటం జరిగిపోయింది.

మూర్తి స్నానం ముగించి డ్రస్ చేసుకొనేసరికి తలుపు చప్పుడైంది. 'కమిన్' అంటూ తలుపు తీశాడు. మెరుపుతీగలా శారద ప్రత్యక్షమైంది. అతని వదనం విప్పారింది.

"కూర్చో శారదా-ఎంత హాపీగా వుంది నిన్ను చూస్తుంటే."

శారద కూర్చొని గదంతా కలయచూచింది.

"గది బాగుంది."

"ఇప్పటిదాకా బాగాలేదు. నువ్వొస్తే గదికే అందం వచ్చి బాగుంది."

"ఓహో. కవిత్వం కూడా ప్రారంభించావా ?"

"ఓ విధంగా చిత్రకారుడూ కవే."

"అవును. కవి లేనిది కల్పిస్తే, చిత్రకారుడు ఉన్నవాటికి రంగు వేసి మాయ చేస్తాడు.

"అంతా మాయేనన్నారు మన వేదాంతులు."

"ఓహో ! వేదాంతంలో కూడా పడ్డావా ? ఇహ నిన్ను రక్షించటం ఆ భగవంతుడి తరం కూడా కాదు."

"భగవంతుడెందుకు, నువ్వుండగా !"

శారద ముఖం విద్యుద్దీపంలా వెలిగింది. మైనర్ గార్డియన్‌లా అతనివైపు చూసింది. పటంలోని శారద అభయ ముద్ర ఆమె తళ తళలాడే కళ్ళలో ప్రతిఫలించింది.

"మాటలు నేర్చావు. ఇంటర్‌వ్యూలో చూపించు ఆ స్పార్క్."

"స్పార్క్ కాజెస్ స్పార్క్. నీ కళ్లలో స్పార్క్ చూస్తే నాకు స్పార్క్ వస్తుందనేగా ఇంటర్‌వ్యూకి వెళ్ళే ముందు నిన్ను చూడాలనుకున్నాను" ఆమె కళ్లలోకి దీక్షగా చూశాడు.

శారద ఆ పొగడ్తకి పొంగిపోయింది. కొంచెం సిగ్గుకూడ కలిగింది. కళ్లు తిప్పుకుని గదంతా కలయచూస్తూ మాట మార్చింది.

"ఇంటర్‌వ్యూ రిహార్సలు వేస్తావా ఏమిటి కొంపతీసి ?"

"ఇంటర్‌వ్యూ ఒక నాటకమే. కాని రిహార్సలు పడని నాటకం."

అతను నవ్వాడు. ఆమె నవ్వింది.

"బాగా మాట్లాడతావు."

"బాగా మాట్లాడటం వేరు, మృదుమధురంగా మాట్లాడటం వేరు. నీలా మధురమధురంగా మాట్లాడలేనుగదా !"

మూర్తి జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి, ఓ సిగరెట్ తీసి వెలిగించి ఫ్లేమ్ ఆర్పి లైటర్ జేబులో వేసుకున్నాడు. శారద కొంచెం తెల్లబోయింది.

"స్పార్క్ కాజెస్ స్పార్క్ అనే సూత్రానికి ఉదాహరణ."

"సింబాలిక్ ఉదాహరణ."

"పూర్వంలేదే. ఈ అలవాటు ఎందుకు చేసుకున్నావు?"

"ఏం మానెయ్యమంటావా ?"

"నీ ఇష్టం. నేనేం మైనర్ గార్డియన్ కాదుగా."

"కాదు. మేజర్ జనరల్‌వే."

శారదకి కొంచెం గర్వం కలిగింది. అవును. మేజర్ జనరలే. "ఆ సిగరెట్ పారెయ్" అని ఆజ్ఞాపించాలనిపించింది. ఇతనికి సర్వదా రక్షణ అవసరం. ఏ ఫ్రెండో ఈ అలవాటు చేసివుంటాడు, సొంతంగా పుట్టిన బుద్ధి కాదు.

"ఎవరు నీ సిగరెట్ గురువు ?" అంది కొంచెం యీసడింపుగా.

"గిరీశం."

"ఎవరా గిరీశం ?"

"గురజాడ కీర్తి జాడ. 'పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్'అని ప్రవచించిన ధూమయుగ వైతాళికుడు."

శారద నవ్వింది.

"రూమంతా సిగరెట్ పీకలు పడెయ్యలేదు. అంతవరకు నయమే."

సిగరెట్ పీకలు ఎక్కడైనా కనిపిస్తాయేమోనని రూమంతా కలయచూస్తున్న శారద అకస్మాత్తుగా ఉలిక్కిపడ్డది. మంచం కిందికి ప్రసరించిన ఆమె చూపులు అక్కడే నిలిచిపోయాయి. నిమిషంలో ఆమెకి ముచ్చెమటలు పోశాయి.

"ఏమిటి శారదా, చూస్తున్నావు ?"

శారద అతనివైపు విస్మయంగా తేరిపార చూసింది. ఆమె వదనంలో కాఠిన్యం అలముకొంది.

"ఇంకే అలవాట్లు చేసుకొన్నావు?"

"కాస్త వక్కపొడీ, గంటకోసారి కాఫీ, దటీజ్ ఆల్."

"అంతే !"

"అంతే. నేను చాలా సింపుల్ అని నీకు తెలుసుకదూ!"

శారద దీక్షగా అతని కళ్ళలోకి చూసింది.

"కొంచెం బీరూ, కాస్త విస్కీ...."

"ఛీ....ఛీ...."

శారద చివాలున లేచి మంచంకిందినించి ఓ సీసా తీసి బల్లమీద విసురుగా పెట్టింది.

"ఇదేమిటి ?

మూర్తి తెల్లబోయాడు.

"అదీ....అదీ...."

"సీసా."

"ఆఁ. అవును సీసా."

"ఏం సీసా ?"

"అవును, ఏం సీసా ?"

"వేట్ 69."

"ఆఁ.... అవును. వేట్ 69. నీ కెలా తెలుసు ?"

"దానిమీద లేబెల్ ఉంది. మరి నీ కెలా తెలుసు ?"

"భలేదానివే. వేట్ 69 అని నువ్వేగా అన్నావు ?"

"లేకపోతే తెలియదా ?"

"అదే అనుకున్నా."

"ఇందులో ఏముంది."

"ఏముంటుంది, వేట్ 69 సీసాలో ? విస్కీ."

"నయం. మంచినీళ్ళు అనలేదు. ఎలా అంటావులే - నీలుందిగా."

"ఉంది" అన్నాడు ఏమనాలో తెలీక.

శారద అతనివైపు జాలిగా చూసింది.

"ఎక్కడిది !"

"అవును, ఎక్కడిది ?"

శారద పకపకా నవ్వింది.

"విజయవాడలో ఓ ఫ్రెండ్ అడిగితే, మళ్ళీ మర్చిపోతావేమోనని హైద్రాబాద్ రాగానే కొనేశావు. ఏం?"

"ఏబ్బే....యిది....యిది...."

"అసలు నువ్వు హైద్రాబాద్ యివాళ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చావా, నిన్న సాయంకాలమే వచ్చావా ?"

"ఇప్పుడే, శారదా."

"కాదు రాత్రి వచ్చావు. ఎవరో ఫ్రెండ్స్ వచ్చారు. డబ్బుందిగా. పార్టీ ఇచ్చావు....రాబోయే ఉద్యోగానికి అడ్వాన్స్ పార్టీ - ఏం ?"

"ఛ....ఛ...."

"ఇది మిగిలిపోయింది."

"శారదా ! ప్లీజ్."

శారద అతని వైపు మళ్ళీ జాలిగా చూచింది.

"ఎందుకు అబద్దాలాడాలని, ఏదో దాచాలని ప్రయత్నిస్తావు."

"నే చెప్పేది విను."

"నువ్వేం కథలల్లక్కర్లేదు. రంగులు పులుముక్కర్లేదు. మూర్తి, నీ మీద నాకు నిజంగా జాలివేస్తోంది. ఈ స్థితిలో నేను కాక ఇంకో స్త్రీ అయితే యీపాటికి నాలుగు దులిపేసి 'నీకూ నాకూ చెల్లు' అని గుడ్‌బై కొట్టేసేది."

మూర్తి భయంగా ఆమె కళ్ళలోకి చూశాడు.

"తొందరపడకు శారదా, నా మాట విను."

"నేనుకూడా తొందరపడితే నువ్వేమైపోతావో మూర్తీ. డియర్, నువ్వొక మైనరువి. నిజంగా మైనరువే. నాకు తెలుసు. నీ రంగుల ప్రపంచం తప్ప ప్రపంచంలో రంగులు నువ్వెరగవు. ఈ వాస్తవ ప్రపంచంలో ఉండే రంగులు నీ మనస్సులో వెలిసే ఇంద్రధనుస్సులోని ఏడు రంగులు కావు. నీ చుట్టూ పనికిమాలిన వాళ్ళు చేరారు. నీ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నిన్ను సర్వనాశనం చేస్తారు."

"ఏమిటి శారదా యిదంతా ?"

"మూర్తీ ! నిజంగా నాకు నీమీద విశ్వాసం ఉంది. ఈ విషయంలో నువ్వు గిరికీలు కొట్టటానికి వీల్లేదు. పొరపాటు ఎవరైనా చేస్తారు. తెలుసుకొని బయటపడటం

లోనే విజ్ఞత ఉంది. నువ్వు అధఃపాతాళంలోకి పోటానికి వీల్లేదు, వీల్లేదు. నా కంఠంలో ప్రాణం వుండగా అలా జరగనివ్వను. ఏదీ, ప్రమాణం చెయ్యి."

శారద గర్వంగా, గొప్పగా, ధీమాగా, దయగా, అనునయంగా, సాధికారంగా అతనివైపు చూస్తూ చెయ్యి చాపింది. ఆమె వైఖరి పాతాళంలోకి పడిపోతున్నవాడిని రక్షించి ఉద్ధరిస్తున్నట్టుగా ఉంది. మూర్తి ఏదో చెప్పాలని తహతహసడుతున్నాడు.

"శారదా....అది....అది....ఆ సీసా...."

"నేనేం వివరణలు, సంజాయిషీలు అడగటంలేదు — ప్రమాణం — అంతే' చెయ్యవా ?"

ఆమె పై అంతస్తుమీద నిలబడి కిందికి చూస్తున్నట్టుగా అతనివైపు చూసింది. బావిలో పడ్డవానికి పగ్గం అందించినట్టుగా అతనివైపు అలాగే చెయి జాపి నిలబడింది.

ఒక్క క్షణం! అంతే అతను చెయిలో చెయ్యి వేస్తాడు. శాశ్వతంగా అతన్ని ఉద్ధరిస్తుంది. తనూ మామూలు స్త్రీయే అయితే దృశ్యం ఎలా వుండేవో ఊహించుకొంటూంటే తను మహోన్నత హిమాలయ శిఖరం మీద నిలబడ్డట్టుగా అనుభూతి కలిగింది.

"మూర్తీ, డియర్. ప్లీజ్."

మంత్రముగ్ధుడిలా ఆమె చేతిలో చెయ్యి వెయ్యబోయాడు.

తలుపు ఎవరో తట్టారు.

"కమిన్."

తలుపులు తెరుచుకున్నాయి. ఎవరో సూట్‌వాలా చప్పున లోపలికి రాబోయి, శారదని చూసి వెనక్కి తగ్గి, మూర్తి వైపు క్షమాపణ కోరుతున్నట్లు చూశాడు.

"సారీ సార్. ఈ గదిలో నేను బసచేశాను. జస్టు, అరగంట క్రితమే ఖాళీ చేశాను. మీరు వచ్చి చేరినట్టున్నారు. ఇక్కడ నా బాటిల్ ఒకటి మర్చిపోయాను. ఆం అదే. ఎక్స్‌క్యూజ్‌మీ,, గదిలోకి ఒక్క దూకుదూకి సీసా తీసుకుని "థాంక్యూ', అంటూ రెండంగల్లో గది దాటిపోయాడు ఆగంతుడు.

[జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక-79]